క్లుప్తంగా

15 నుంచి శరన్నవరాత్రుల ఉత్సవాలు

కోవెలకుంట్ల: స్థానిక సరస్వతీనగర్‌లో వెలసిన ప్రసన్నభారతీమాత ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి శరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చంద్రశేఖర్‌శర్మ, విశ్వనాథ శర్మ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సరస్వతీ మాత బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. అదేవిధంగా 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణదేవి, 18న మహాలక్ష్మీదేవి, 19న లలితాదేవి, 20న సరస్వతీదేవి, 21న గౌరీదేవి, 22న దుర్గాదేవి, 23న మహిషాసురమర్ధినిదేవి, 24న రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. అర్చకుడు వెంకట నరసింహశర్మ ఆధ్వర్యంలో పూజలు కొనసాగుతాయని, అమ్మవారిని దర్శించుకుని దీవెనలు పొందాలని భక్తులకు సూచించారు.

నేడు బందార్లపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బందార్లపల్లెలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వైద్య నిపుణులు ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్.లింగందిన్నెలో...

సంజామల: మండల పరిధిలోని ఆర్.ఆంగందిన్నె గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. సీనియర్ వైద్యులు, వైద్య బృందం ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

14న ఉచిత కంటి వైద్య శిబిరం

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలోని హజరత్ సయ్యద్ షా ఆహమ్మద్ బాషా ఖాద్రి శుత్తారియమని దర్గా ఉరుసు సందర్భంగా ఈ నెల 14న ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో డాక్టర్ సయ్యద్‌హుస్సేన్‌బాషా, ఖాద్రి బాషా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కంటి వైద్య శిబిరంలో బెంగుళూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రి వైద్యులు కంటి జబ్బులకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. కంటి ఆపరేషన్ అవసరం ఉన్నవారికి శంకర కంటి వైద్యశాలలో ఉచితంగా చేస్తారన్నారు. కంటి సమస్యలు ఉన్న వ్యక్తులు రేషన్‌కార్డు, ఓటర్, ఆధార్‌కార్డులతోపాటు రెండు ఫొటోలతో వైద్య శిబిరానికి రావాలని సూచించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

బేతంచెర్ల: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బలపాలపల్లె ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ బుధవారం సందర్శించారు. తాగునీటి సమస్యపై ఆరా తీశారు. విద్యుత్ సరఫరా వేళలో మార్పు మూలంగా తాగునీటి సమస్య తలెత్తిందని హెచ్‌ఎం రిజ్వాన తెలుపగా ముందస్తుగా నీటిని నిల్వ ఉంచుకోవానలి ఎంఈఓకు సూచించారు.

ఆలయంలో చోరీ

అవుకు: మండల కేంద్రం అవుకులోని ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అవుకు పట్టణానికి చెందిన షేక్ వలి మంగళవారం అర్ధరాత్రి ఆంజనేయ స్వామి ఆలయం తాళం పగులగొట్టి హుండీలోని రూ.6,100 చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకొని, నగదు రికవరీ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ విష్ణునారాయణ తెలిపారు.

నిందితుడి అరెస్టు

ప్యాపిలి: స్థానిక బీసీ కాలనీలో నివాసం ఉంటున్న బోయ అంజనమ్మ గత నెల ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త బోయ పరంగి రామాంజనేయులు వేధింపులు తాళలేక ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడిని బుధవారం స్థానిక రాజా గ్రాండ్ హోటల్ వద్ద పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

సన్మానం

బనగానపల్లె రూరల్ : స్థానిక మండల పరిషత్ కస్బా ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ పదోన్నతిపై ఎస్ నసీమా, క్రిష్ణవేణి, సాధారణ బదిలీ అయిన జి ఓబులరెడ్డిని హెచ్‌ఎం సుంకన్న ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంఈఓ స్వరూపతోపాటు ఉపాధ్యాయులు ప్రతాప్,సత్యప్రకాష్,నాగరాజు, కళావతి, పుష్పలత,క్రిష్ణయ్య వారికి శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.

లోకాయుక్తలో ఫిర్యాదు

డోన్ టౌన్: పొలాన్ని ఆన్‌లైన్ చేయడం లేదని డోన్ రెవెన్యూ అధికారులపై పట్టణానికి చెందిన రిటైర్డ్ జిల్లా జడ్జి బెనిక బుద్ద నాగేంద్రరావు ఫిర్యాదు మేరకు బుధవారం వెంకటాపురం వీఆర్వో మాధవస్వామి కర్నూలుకు వెళ్లి లోకాయుక్త అధికారులకు రికార్డులు అందజేశారు. రెండేళ్ల క్రితం నాగేంద్రరావు మండలంలోని అబ్బిరెడ్డి పల్లెలో పొలం కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నాడు. ఈ పొలాన్ని తనపేరుపై ఆన్‌లైన్ చేయాలని సచివాలయంతోపాటు స్పందనలో ఫిర్యాదు చేసినా స్పందన లేదు. దీంతో గత నెలలో బాధిత రిటైర్డ్ జడ్జి లోకాయుక్తను ఆశ్రయించారు.



బనగానపల్లెలో ఓ వ్యక్తికి ఈసీజీ చేస్తున్న డాక్టర్ శివశంకరుడు



బేతంచెర్లలో కంటి వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీపీ బుగ్గన



ప్యాపిలిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజారోగ్యానికి పెద్దపీట

- వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్
- మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
- ప్రతి గ్రామంలోనూ జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



వృద్ధుడికి కళ్లజోడు పెడుతున్న ఎమ్మెల్యే కాటసాని, చిత్రంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి



కోవెలకుంట్ల వైద్య శిబిరంలో ఓపీ నమోదు చేసుకుంటున్న ప్రజలు

అవుకు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేసిందని, వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు సీఎం జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ప్రజారోగ్యమే ప్రథమ ధ్యేయంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచే ప్రత్యేక చర్యలు చేపట్టారని, వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మండల కేంద్రం అవుకు–2 సచివాలయ పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు వినోద్ కుమార్, యమున, వైద్య నిపుణులు రాఘవేంద్ర, మంగ్యానాయక్ ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా రఘునాథ్ రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి సీఎం ప్రాధాన్యతనిస్తున్నారని, ఆరోగ్య శ్రీ కింద మూడువేలకు పైగా వైద్య సేవలను ప్రజలు ఉచితంగా పొందేలా సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. అంతేకాకుండా మారుమూల పల్లెల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విజయవంతగా కొనసాగుతుందని గుర్తు చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని భావించి మరో అడుగు ముందుకు వేసి ప్రతి పల్లెలోనూ అనుభవజ్ఞులైన వైద్యులతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి ఎన్నో రకాల వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నవారికి ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పేదల కోసం పాటుపడే జగనన్నను మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వృద్ధులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏఈ క్రిష్టారెడ్డి,మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అశ్విన్‌కుమార్, మండల సచివాలయ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం, సర్పంచ్ మందా గుర్రమ్మ, నాయకులు చల్లా విక్రాంత్ రెడ్డి, రామన్న, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యం

బేతంచెర్ల: ప్రజా సంక్షేమంతో పాటు ప్రతి పేదవాడికి ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉర్దూ అకాడమీ కమిటీ సభ్యులు ముర్తుజావలి, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా హుసేన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దస్తగిరిబాబు, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్, సర్పంచ్ శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. వైద్యులు ప్రజల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా వృద్ధులకు కంటి అద్దాలు ఇచ్చారు. ఐసీడీయస్ సూపర్ వైజర్ రాధా దేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ప్రజా ప్రతినిధులు సందర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు బాబుల్ రెడ్డి, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, చింతల నాగిరెడ్డి, తవిసి కొండ, రహిమానుపురం, గోరుమానుకొండ సర్పంచ్‌లు లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. పేదల ఆరోగ్యానికి రక్ష

కోవెలకుంట్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తోందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని రెండవ గ్రామ సచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆయా కాలనీలకు చెందిన 707 మంది ఓపీ నమోదు చేసుకున్నారు. కోవెలకుంట్ల సీహెచ్‌సీ, రేవనూరు, మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్లు మేఘన, చంద్రశేఖర్‌రెడ్డి, మహబూబ్‌సుభాని, రాబర్ట్ కెన్నెడి, అశోక్, కంటివైద్య నిపుణుడు గంగాధర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 342 మంది మహిళలు, 275 మంది పురుషులకు వివిధ రోగాలకు సంబంధించి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 66 మంది చిన్న పిల్లలు, 24 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే కంటి సమస్యలతో బాధపడుతున్న 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి మెరుగైనవైద్యం అందాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందు చూపుతో ఈ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యదున్నీసా, తహసీల్దార్ పుష్పకుమారి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, దస్తగిరిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

బనగానపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రాష్ట్ర షేక్‌ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. పట్టణంలోని సచివాలయం-4 పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఎంపీడీఓ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభించింది. 726 మంది వివిధ ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్లు శివశంకరుడు, సోహెల్ బాబు, ఫీరోజ్, శైలజ,కళ్యాణి, టెక్నీషియన్స్ ప్రజలకు వైద్య, రక్త పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర షేక్‌ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్ సందర్శించి వైద్య సేవలను పరిశీలించడంతో పాటు ఆయన కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఎస్ వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈఓ ఖలీల్, ఎంఈఓ-2 శ్రీనివాసులు, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు ఆశా వర్కర్లు, వలంటీర్లు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం

ప్యాపిలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నట్లు తహసీల్దారు చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. సర్పంచ్ ఉషారాణి ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో వైద్యులు ఇంతియాజ్ ఖాన్, వాణిశ్రీ, ప్రసాద్ నాయక్ తదితరులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 502 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 14 మందిని డోన్, కర్నూలు ఆసుపత్రులకు సిఫారసు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కమతం భాస్కర్ రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీపీ, కంటి పరీక్షలు చేయించుకున్నా..



గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో బీపీ, కంటి పరీక్షలు ఉచితంగా చేశారు. వైద్యులు బాగా పరీక్షించి నెలకు సరిపడే ఐ డ్రాప్స్, విటమిన్స్, బీపీ మందులను ఉచితంగా అందించారు. గతంలో పరీక్షలకు,మందులకు డబ్బులు ఖర్చు అయ్యేది. వైద్య శిబిరం ఏర్పాటుతో ఖర్చులు మిగిలాయి. ఇలాంటి కార్యక్రమాలు తరుచూ నిర్వహిస్తే పేదలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– మరియమ్మ, అవుకు గ్రామం

పేదలకు మంచి కార్యక్రమం



గ్రామంలోనే వైద్య నిపుణులతో ఆరోగ్య పరీక్షలు చేయడం పేదలకు మంచి కార్యక్రమం. కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతూ నీరసించిపోయా. హెల్త్ క్యాంప్‌లో వైద్య,రక్త పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు కూడా అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వం మరెన్నో నిర్వహించాలి. మా లాంటి వృద్ధులకు ఇటువంటి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– చదువుల చిన్నమ్మ, అవుకు గ్రామం

పైసా ఖర్చులేకుండా ఈసీజీ చేశారు



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం పేదలకు ఎంతో ఉపయోగపడుతుంది. నేను కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నా. పైసా ఖర్చులేకుండా ఈసీజీ తీశారు.మందులు కూడా ఉచితంగా ఇచ్చారు.ప్రైవేట్‌గా చూపించుకోవాలంటే రూ.1500 నుంచి 3 వేల వరకు వరకు వసూళ్లు చేస్తారు. ఇలాంటి హెల్త్ క్యాంప్‌లు అప్పుడప్పుడు నిర్వహిస్తే బాగుంటుంది.

– గౌస్‌బీ, పేషెంట్, బనగానపల్లె

ఆరోగ్యంపై ఇంత శ్రద్ధ ఎప్పుడూ లేదు



ఇంతకముందు గ్రామాలలో విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలి సీరియస్‌గా మారితే తప్పా వైద్య శిబిరాలు కనపడేవి కావు. చిన్న వ్యాధికి సైతం భారీగా డబ్బులు ఖర్చు అయ్యేవి. ప్రజలు ఇబ్బంది పడకూడదని ప్రభుత్వం గ్రామంలోనే ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేసి సీఎం పేద ప్రజలకు అండగా నిలిచారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– లక్ష్మీదేవి, గూటుపల్లె, బేతంచెర్ల మండలం

బీపీ,షుగర్ పరీక్షలు చేయించుకున్నా

జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ ప్రజలకు ఉపయోగపడుతుంది. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో నేను బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు బాగా పరీక్షించి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందించారు. మాలాంటి వృద్ధులకు గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు అందించిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– ఎల్లయ్య, గూటుపల్లె, బేతంచెర్ల మండలం

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

- ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ రూరల్ : అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేయాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక గెస్ట్‌హౌస్‌లో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి రూ. వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. అలాగే ప్రతి గ్రామానికీ తీగు నీరు అందించామన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తప్ప కుండా గ్రామాలలో తిరగాలని, ప్రజల సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచ్, ఎంపీటీసీలకు తప్ప సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ రాజ్‌కుమార్‌మాదవ్, ఎంపీడీఓ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ మధు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండండి



ఎరువు స్టాక్‌ను పరిశీలిస్తున్న మోహన్ రావు

అవుకు: వ్యవసాయ అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని, సాగుకు సంబంధించి ఎప్పటికప్పుడు సూచనలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అవుకు-2 రైతు భరోసా కేంద్రాన్ని సహాయ వ్యవసాయ సంచాలకులు సుధాకర్‌తో కలిసి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎరువుల స్టాక్, సాగు చేసిన పంటల వివరాలను ఏఓ అబ్దుల్ హక్‌ను అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ కియోస్క్‌ను పరిశీలించి నమోదు చేసిన రైతుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేయాలని సూచించారు. అదేవిందంగా ఈకేవైసీ పూర్తి కాకపోతే ప్రభుత్వం నుంచి రైతులకు అందే వ్యవసాయ పథకాల లబ్ధికి అర్హత పొందలేరనే విషయాన్ని వివరించాలన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతుల ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్బీకేలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులకు తెలియజేయాలని వీఏఏలకు సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు సింధియా, ఉమాదేవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు దేశానికి గర్వ కారణం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్ : ఆడపిల్లలు దేశానికి గర్వ కారణం అని, బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తు అభివృద్ధి చెందాలని డోన్ సబ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి తంగమణి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురష్కరించుకొని స్థానిక బాలికల ఉన్నత పాఠశాల్లో ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను ప్రేమించడంలో ఆడ పిల్లలను మించినవారు లేరన్నారు. అనంతరం చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మైమున్నీసా, ఆర్డీటీ సంస్థ డైరెక్టరు నాగేశ్వరరెడ్డి, ఏటీఎల్ సభ్యులు, నాగభూషణం, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పాతపేట హైస్కూల్లో : అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురష్కరించుకొని పాతపేట హైస్కూల్లో హెచ్‌ఎం పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు హెచ్‌ఎం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

మండలాభివృద్ధికి కృషి చేయండి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : మండల అభివృద్ధికి వివిధ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు మానసవీణ అధ్యక్షతన ఎంపీడీఓ శివరామయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అభివృద్ధి నిధుల మంజూరు విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయా గ్రామాలోని ప్రజా ప్రతినిధులు,వలంటీర్లు పాల్గొన్ని ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.నాడు నేడుతోపాటు జల్ జీవన్, ఎన్ఆర్‌జీఎస్, డీఎంఎఫ్, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధుల పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జగనన్న గోరుముద్ద పథకం కింద పాఠశాలల్లో అమలవు తున్న మధ్యాహ్నభోజన పథకంలో వంట ఏజెన్సీలు మెనూ పాటించేలా పరిశీలించాలని ఎంఈఓ స్వరూపకు సూచించారు. బనగానపల్లెలోని భానుముక్కలలో 24 గంటలు విద్యు త్ సరఫరా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అవసరం అయితే టౌన్ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ ను తీసుకోవాలని ఏఈలు గర్జప్ప,శ్రీనివాసులకు సూ చించారు. సమావేశంలో కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ కిశోర్ కుమార్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి రఘువరణ్, ఈఓ ఖలీల్, ఈఓఆర్‌డీ గురుప్రసాద్, ఏపీఎం తిరుపాల్‌రెడ్డి, ఏసీడీపీఓ రోజారాణి, ఏఓ సుబ్బారెడ్డి, ఏపీఓ హరికృష్ణ, మండల ఉపాధ్యక్షురాలు ఎం.లక్ష్మీదేవి,కుర్ణికార్పొరేషన్ డైరెక్టర్ శ్యామ లాదేవి, షేక్ ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, మండల కోఆప్షన్ సభ్యులు అనిల్, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు స్కూల్ హెచ్‌ఎం పర్విన్‌బాను బుధవారం తెలిపారు. నంద్యాల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో అండర్-14 విభాగంలో వి మహిధర్, ఎస్ సంధ్యారాణి, సి.మధుప్రియ, అండర్-15 విభాగంలో డి విజయ్, జి.ప్రణయ్‌కుమార్, సుజాత, యం . సుకన్యలు ప్రతిభ చూపించారన్నారు. అలాగే రాష్ట్రస్థాయి యోగ పోటీలకు అండర్ -17 విభాగంలో బి మధుసూదన్, సైక్లింగ్ అండర్ -14 విభాగంలో రజాక్ ఎంపికయ్యారని హెచ్‌ఎం తెలిపారు. ప్రతిభచూపించిన విద్యార్థులతోపాటు అందుకు కృషి చేసిన వ్యాయామ యోగ మాస్టర్స్‌ను హెచ్‌ఎం అభినందించారు.

కరాటే పోటీల్లో డోన్ విద్యార్థుల ప్రతిభ

డోన్ టౌన్ : కర్నూలు పట్టణంలోని అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో డోన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనభరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యినట్లు కరాటే మాస్టర్ రమణ తెలిపారు. శ్రీసుధ సీబీఎస్ఈ స్కూల్‌కు చెందిన సాత్విరెడ్డి 30కేజీల విభాగం, తనిష్రెడ్డి 35కేజీల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనభచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా బుధవారం విద్యార్థినులతోపాటు కరాటే మాస్టర్ రమణను ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షిప్తం

విభేదాలు బట్టబయలు!

డోన్ : పట్టణంలోని వార్డు సచివాలయాల్లోని ఉద్యోగులు, గ్రామ రెవెన్యూ కార్యదర్శుల విభేదాలు బుధవారం బట్టబయలయ్యాయి. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను మంజూరు జాప్యంపై సచివాలయ, రెవెన్యూ ఉద్యోగుల మధ్య పొసగడం లేదు. తమను బాధ్యులను చేయడం తగదని సచివాలయ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో 15వ సచివాలయంలో వెల్ఫేర్ కార్యదర్శి రమేష్, వీఆర్ఓ యుగంధర్ మధ్య మంగళవారం జరిగిన వాగ్వాదంతో విభేదాలు రచ్చకెక్కాయి. తహసీల్దార్ విద్యాసాగర్ జోక్యంతో అప్పటికి వ్యవహారం సద్దుమణిగినా సచివాలయ ఉద్యోగులు అసంతృప్తిగానే ఉన్నారు. బుధవారం ఈ విషయమై సచివాలయ ఉద్యోగులందరూ వీఆర్ఓల పనితీరుపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. ఇరువర్గాలకు సర్ది చెప్పినట్లు తహసీల్దార్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల ఉన్నత పాఠశాలకు చెందిన యలేశ్వరి రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో యలేశ్వరి ప్రతిభ చాటుకుంది. త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఉమాదేవి, పీడీ అశోక్ రెడ్డి తెలిపారు.

ఆర్డీఓకు వినతి

డోన్ : డోన్ రెవెన్యూ సబ్‌డివిజన్‌లో రెవెన్యూ సహాయకులకు పదోన్నతులు కల్పించాలని ఏపీ విలేజ్ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సత్యరాజు, వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు రామచంద్రుడు బుధవారం ఆర్డీఓ వెంకటరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే జిల్లాలో ఈ ప్రక్రియ మొదలైనందున డోన్‌లోనూ పదోన్నతులు కల్పిస్తామని ఆర్డీఓ వారికి హామీ ఇచ్చారు. అనంతరం సంఘం నాయకులు సత్యరాజు, రామచంద్రుడు, రామక్రిష్ణ, శివశంకర్, వరప్రసాద్, రవికుమార్, రామయ్య, శివశంకర్‌నాయుడు తదితరులు ఆర్డీఓను సన్మానించారు.

క్రీడాదుస్తుల పంపిణీ

డోన్ రూరల్ : మండల పరిధిలోని యు.కొత్తపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం ఇన్నవీల్‌క్లబ్ సభ్యులు బాలికలకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు శాలినీ, మాజీ అధ్యక్షురాలు శైలజ, సెక్రటరీ శాంతి, హెచ్‌ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థల బలోపేతమే ప్రభుత్వ ధ్యేయం

డోన్ టౌన్ : రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేసి వ్యవసాయ రంగాన్ని లాభ సాటిగా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ క్రాంతి పథకం సీసీలు రాజన్న, ఓబులేసు, కృష్ణమూర్తిలు అన్నారు. స్థానిక జాడీల ఫ్యాక్టరీ ఆవరణలోని వెలుగు పథకం కార్యాలయ భవనంలో బుధవారం రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఒకే గ్రామంలో ఒకే పంటలను పండించే రైతులను సంఘటితం చేసి గ్రూపుగా ఏర్పరచి ఉత్పాదకతను పెంచే విధంగా వారికి అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో మండల స్త్రీ నిధి మేనేజర్ చంద్రిక, సీసీ బేగం వివిధ గ్రామాలకు చెందిన రైతు సంఘం మహిళా లీడర్లు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు

డోన్ : పట్టణంలోని వైఎస్ నగర్ ప్రాంతంలో కొండపేటకు మంచినీటిని అందించే 400 ఎంఎం డియా పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో యుద్ధ ప్రాతిపతికన మరమ్మతులు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. బుధవారం పైపులైన్ లీకేజీ ప్రాంతాన్ని ఆయన సందర్శించి పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలించారు.